


బక్రీద్ నేపథ్యంలో ఆదివారం నగరవ్యాప్తంగా సందడి నెలకొన్నది. జీవాల అమ్మకాలు జోరందుకున్నాయి. సీతాఫల్‌మండి ప్రధాన రోడ్డులో కనిపించిన రూ. 85వేల విలువైన ఈ మేకపోతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, సోమవారం 17 జూన్ 2024 | HYDERABAD




# 3784.99 కోట్లతో.. 39 ఎస్టీపీలు

## వంద శాతం మురుగునీటి శుద్ధి దిశగా అడుగులు

కేసీఆర్ సర్కారు హయాంలోనే రూ. 3866.41 కోట్లతో 31 ఎస్టీపీలకు శ్రీకారం

విడతల వారీగా అందుబాటులోకి.. తాజాగా అమృత్‌పథకం కింద భారీ మురుగునీటి ప్రాజెక్టు

ప్రభుత్వ పరిశీలనలో దస్త్రం, త్వరలో పరిపాలన అనుమతులు

సిటీబ్యూరో: వంద శాతం మురుగు శుద్ధి చేసే తొలి నగరంగా హైదరాబాద్‌ను నిలుపాలన్న గత కేసీఆర్ ప్రభుత్వ లక్ష్యం నెరవేరనున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పురుడుపోసుకున్న ప్రతిపాదనల్లో మరో అద్భుతమైన భారీ మురుగునీటి ప్రాజెక్టు పట్టాలెక్కేందుకు సిద్ధమవుతున్నది. ఇప్పటికే రోజూ ఉత్పన్నమయ్యే మురుగునీటిని వంద శాతం శుద్ధి చేయడానికి వీలుగా రూ. 3866.41 కోట్ల వ్యయంతో 1259.50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో 31 కొత్త ఎస్టీపీలను చేపట్టి..ఏడు చోట్ల వినియోగంలోకి తెచ్చారు. దుర్గం చెరువు, కోకాపేట ఎస్టీపీలు అందుబాటులోకి రాగా, కాంగ్రెస్ సర్కారు మిరాలం, పెద్ద చెరువు, నల్లచెరువు ఎస్టీపీలను ప్రారంభించారు. ఈ క్రమంలోనే మియాపూర్ పటేల్ చెరువు, సఫిల్‌గూడ, ఖాజాగూడ ఫత్తేనగర్, వెన్నెల గడ్డ, నాగోల్ ఎస్టీపీల ట్రయల్ రన్ జరుగుతోంది. త్వరలోనే వీటిని ప్రారంభించనున్నారు. ఈ క్రమంలోనే రూ. 3784 కోట్ల అంచనా వ్యయంతో 965 ఎంఎల్‌డీల సామర్థ్యంతో మరో 39 ఎస్టీపీల ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టబోతున్నారు.



### 39 ఎస్టీపీల ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం..

అమృత్ పథకం కింద కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 39 ఎస్టీపీల ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు మొత్తంలో 25 శాతం కేంద్రం, 35 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా, 40 శాతం సంబంధిత ఏజెన్సీ వాటా చొప్పున హెచ్‌ఏఎం మోడ్‌లో ఈ ప్రాజెక్టు చేపట్టనున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉన్న ఈ ప్రాజెక్టుకు త్వరలోనే పరిపాలన అనుమతులు లభించనున్నాయని ఓ ఉన్నతాధికారి తెలిపారు. 39 ఎస్టీపీల్లో దాదాపు 20 చోట్ల భూ సేకరణ సమస్య లేదని, మిగిలిన చోట కలెక్టర్లతో సంప్రదింపులు జరుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే ఈ ప్రాజెక్టు పనులకు టెండర్లను ఆహ్వానించి పనులు చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**నూతన ఎస్టీపీలు ఇవే**

**ప్యాకేజీ-1లో రూ. 493.50 ఎంఎల్‌డీ సామర్థ్యం/రూ.1878.55కోట్లు**

| ప్రాంతం | ఎస్టీపీ సామర్థ్యం ఎంఎల్‌డీ | ప్రాజెక్టు వ్యయం రూ.కోట్లలో) |
|---|---|---|
| అమీన్‌పూర్ | 28 | రూ.116.08కోట్లు |
| తెల్లాపూర్ (నేరేళ్ల) | 31 | రూ.120.61 |
| ఇక్రిశాట్ | 24.50 | రూ.101.79 |
| ఉక్షేబావి | 100 | రూ.328.56 |
| పోచారం | 12.50 | రూ.55.82 |
| తిమ్మక్క చెరువు | 98.50 | రూ.323.63 |
| గండిగూడెం | 22.50 | రూ.93.62 |
| గౌడవెల్లి | 1.50 | రూ.10.56 |
| పోతాయిపల్లి లేక్ | 7.50 | రూ.39.69 |
| నవకుంట లేక్ | 14.50 | రూ.64.87 |
| నల్లచెరువు-2 | 36.50 | రూ.140.90 |
| కాప్రా | 5.50 | రూ.28.90 |
| హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ | 36.50 | రూ.140.90 |
| ఫతేనగర్-2 | 20 | రూ.89.32 |
| చిత్రపురి కాలనీ | 20 | రూ.89.32 |
| నార్సింగి | 34.50 | రూ.133.98 |

**ప్యాకేజీ-2లో రూ. 471.50 ఎంఎల్‌డీ సామర్థ్యం/రూ.1906.44కోట్లు**

| ప్రాంతం | ఎస్టీపీ సామర్థ్యం ఎంఎల్‌డీ | ప్రాజెక్టు వ్యయం రూ.కోట్లలో) |
|---|---|---|
| పీర్జాదిగూడ | 61 ఎంఎల్‌డీ | రూ.200.93కోట్లు) |
| కొర్రెముల | 34.50 | రూ.133.98 |
| నాగారం లేక్ | 47.50 | రూ.174.59 |
| చీర్యాల లేక్ | 6.50 | రూ.34.59 |
| కుందన్‌పల్లి | 9 | రూ.47.63 |
| యానాంపేట | 26 | రూ.107.91 |
| కుంట్లూరు | 31.50 | రూ.122.60 |
| గౌరెల్లి | 7 | రూ.36.85 |
| ఎదుల చెరువు | 23.50 | రూ.97.71 |
| పల్లె చెరువు | 13.50 | రూ.58.89 |
| ఉమ్దా సాగర్ | 23.50 | రూ.97.71 |
| బండ్లగూడ | 5.50 | రూ.28.91 |
| గుర్రం చెరువు | 19.50 | రూ.87.21 |
| మీర్‌పేట తలాబ్ ఎస్టీపీ | 18 | 78.95 |
| చందన చెరువు | 20 | రూ.89.32 |
| రావిర్యాల | 12 | రూ.53.71 |
| బొంగుళూరు | 5.50 | రూ.28.90 |
| మాసబ్ చెరువు | 36.50 | రూ.140.90 |
| కొత్వాల్‌గూడ | 1 | రూ.6.84 |
| లేక్ కాముని | 2.50 | రూ. 16.80 |
| హైదర్షాకోట్ | 36.50 | రూ.140.90 |
| బాపూఘాట్ (సంగమం) | 31 | రూ.120.61కోట్లు |

# ఎకో పార్కును పట్టించుకోరా...!

6 నెలలుగా ఎక్కడి పనులు అక్కడే

నిరుపయోగంగా కోట్లాది రూపాయల నిధులు

85 ఎకరాల్లో అత్యాధునిక శైలిలో

కొత్వాల్‌గూడ ఎకో పార్కు నిర్మాణం

దేశంలోనే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా చేపట్టిన హెచ్ఎండీఏ

సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ): కోట్లు వెచ్చించి చేపట్టిన ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. అక్షరాలా రూ.300 కోట్లకు పైగా అంచనాతో చేపట్టిన కొత్వాల్ గూడ ఎకో పార్కు ప్రాజెక్టును ఆరు నెలలుగా పట్టించుకున్న వారే కరువయ్యారు. ఇప్పటి వరకు సుమారు వంద కోట్లకు పైగా ఖర్చు చేసి రకరకాల అభివృద్ధి పనులు చేపట్టారు. ముఖ్యంగా అద్భుతమైన డిజైన్లతో రూపొందించిన ల్యాండ్ స్కేపింగ్, బోర్డు వాక్ పనులు గతేడాది నవంబర్ నాటికే పూర్తి చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కొత్వాల్‌గూడ ఎకో పార్కుకు రాజకీయ గ్రహణం పట్టింది. గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష చేసిన దాఖలాలు లేవు. విశ్వనగరంగా మారుతున్న హైదరాబాద్ మహానగరంలో పర్యాటకానికి పెద్ద పీట వేస్తూ భారత దేశంలో ఇంతకు ముందు ఎక్కడా లేని విధంగా అత్యాధునిక పర్యాటక క్షేత్రాన్ని కొండలు, గుట్టల మధ్య నిర్మించాలని గత కేసీఆర్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. నగరం ప్రతిష్టను పెంపొందించేలా ఔటర్ రింగు రోడ్డు పక్కన అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదు. కోట్లు వెచ్చించి చేపట్టిన ల్యాండ్ స్కేపింగ్‌తో పాటు ఇతర పనులన్నీ నిరుపయోగంగా మారే పరిస్థితి నెలకొన్నది.

### దేశంలోనే అతి పెద్ద అక్వేరియం...

ఐటీ కారిడార్, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అనుసంధానం చేసే ఔటర్ రింగురోడ్డును ఆనుకొని ఉన్న సుమారు 85 ఎకరాల విస్తీర్ణంలో కొత్వాల్‌గూడ ఎకో పార్కు నిర్మాణం పనులు చేపట్టారు. ఇందులో ఎంతో ఆకర్షణీయమైన ల్యాండ్‌స్కేపింగ్, గుట్టల మధ్య హాయిగా నడిచేందుకు బోర్డు వాక్‌తో పాటు దేశంలోనే అతి పెద్ద అక్వేరియం, ఏవీయరీ (పక్షి శాల) కేంద్రాల నిర్మాణాన్ని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) చేపట్టింది. శివారు ప్రాంతంలో నగర వాసులకు అద్భుతమైన వినోద కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు గత ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చినా, ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టింది. చూస్తుండగానే 6 నెలలు గడిచిపోగా, పార్కులో ఇప్పటివరకు కోట్లాది రూపాయలు వెచ్చించి చేపట్టిన పనులకు ఫలితం లేకుండా పోతోంది. ఎకో పార్కు నిర్మాణ పనులు పూర్తయి ఉంటే.. మహానగరానికి మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా నిలిచే అవకాశముండేది. అలాంటి ప్రాజెక్టును పట్టించుకోక పోవడం అంటే ప్రజా ధనాన్ని వృథా చేయడమేనని పలువురు విమర్శిస్తున్నారు. నగర శివారు ఉన్న కొత్వాల్ గూడ పార్కును ఆనుకొని హిమాయత్‌సాగర్ జలాశయం ఏడాది పొడవునా నిండుగా ఉండటంతో చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది ఈ జలాశయం చూసేందుకు వచ్చి వెళ్తుంటారు. ఇలాంటి ప్రాంతంలోనే హెచ్ఎండీఏ చేపట్టిన ఎకో పార్కుతో ఎంతో మందికి ఆటవిడుపుగా మారేంది. ప్రభుత్వానికీ ఆదాయవనరుగా ఉండే ఈ ప్రాజెక్టును ఎందుకు పట్టించుకోవడం లేదంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కొత్వాల్‌గూడ ఎకో పార్కు పనులను పూర్తి చేసిన నగర వాసులు సందర్శించేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

# నాణ్యత..నిగ్గుతేల్చేందుకు..

థర్డ్ పార్టీ ఏజెన్సీలతో తనిఖీలు

మూడేండ్ల పనులపై పర్యవేక్షణకు నిర్ణయం

ఏజెన్సీల ఎంపికకు టెండర్లు

సివిల్ ఇంజినీరింగ్ పనులపై దృష్టి

సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ ) : జీహెచ్ఎంసీలో పనుల్లో ఏ మేర నాణ్యత ఉందో నిగ్గు తేల్చేందుకు ఏజెన్సీలతో తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు థర్డ్ పార్టీలుగా ప్రముఖ ఇంజినీరింగ్ కాలేజీలు, యూనివర్సిటీలు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ( ఆర్ అండ్ డీ) సంస్థల నుంచి తాజాగా జీహెచ్ఎంసీ టెండర్లు ఆహ్వానించింది. సీఆర్ఎంపీ, ఎస్ఎన్‌డీపీ, హౌసింగ్, పీఎంసీ పనులు మినహా సివిల్ ఇంజినీరింగ్ పనులను ఎంపికయ్యే ఏజెన్సీలు తనిఖీలు చేయనున్నాయి. పనులను నిర్ణీత వ్యవధిలో తనిఖీ చేయాల్సి ఉంటుంది. సిమెంట్, కాంక్రీట్ ఫుట్‌పాత్‌లు, బీటీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీలు, వరద నీటి డ్రైయిన్లు, ఆర్‌సీసీ భవనాలు, కల్వర్టులు, బ్రిడ్జిలు తదితర పనులను పర్యవేక్షించనున్నారు. ఇంజినీరింగ్ విభాగం పనులను 12 ఏజెన్సీలుగా థర్డ్ పార్టీ నిపుణులు ఎంపిక చేస్తారు. 30 సర్కిళ్లను 12 విభాగాలుగా చేసి.. ఒక్కో ఏజెన్సీకి ఒక్కో విభాగం బాధ్యతలు అప్పగిస్తారు. పది కిలోమీటర్ల పరిధిలోని ఇంజినీరింగ్ సంస్థల నిపుణులే ఏజెన్సీలుగా టెండర్లలో పాల్గొనాల్సి ఉంటుంది. ఏఐసీటీఈ గుర్తింపు కలిగి ఉండటంతో పాటు ప్రభుత్వ యూనివర్సిటీల్లో సివిల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌కు అనుబంధంగా ఉండాలి.



**మూడేండ్లలో జరిగిన పనులు -వాటి విలువ**

| సంవత్సరం | పనులు | విలువ (రూ.కోట్లు) |
|---|---|---|
| 2021-22 | 6456 | 1835 |
| 2022-23 | 7235 | 3246 |
| 2023-24 | 6386 | 1951 |

**12 విభాగాలు -వాటిల్లోని సర్కిళ్లు**

- కాప్రా, ఉప్పల్
- హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్
- మలక్‌పేట, సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట
- చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్
- మెహిదీపట్నం, కార్వాన్, గోషామహల్
- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్
- యూసుఫ్‌గూడ, చందానగర్
- శేరిలింగంపల్లి , రామచంద్రాపురం-పటాన్‌చెరు
- మూసాపేట, కూకట్‌పల్లి
- కుత్బుల్లాపూర్, గాజులరామారం , అల్వాల్
- ముషీరాబాద్, అంబర్‌పేట
- సికింద్రాబాద్, బేగంపేట

# నేరాలు..ఘోరాలు..!

## నడిరోడ్డుపైనే హత్యలు

దారి దోపిడీలు..ప్రతీకార దాడులు

నగరంలో పెరిగిపోతున్న క్రైమ్ రేట్

కొరవడుతున్న శాంతిభద్రతలు..

భద్రతకు భరోసా కరువు

**డల్‌గా..డయల్ 100**

సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ): మినీ ఇండియాగా పేరుగాంచిన మహానగరంలో శాంతిభద్రతలు గాడి తప్పుతున్నాయా....హైదరాబాద్ నగరం మరో బిహార్‌గా మారుతున్నదా..? ప్రస్తుతం జరుగుతున్న ఘటనలు చేస్తుంటే.. అవుననే అనిపిస్తున్నది. పట్టపగలే నడి రోడ్లపై జరుగుతున్న వరుస హత్యలు ప్రజల గుండెల్లో దడపుట్టిస్తున్నాయి. పట్టపగలే రోడ్లపై జరుగుతున్న దోపిడీలు, రాత్రి సమయాల్లో ఇండ్లపై విరుచుకుపడుతున్న దొంగల ముఠాలతో ప్రజల ఆస్తులకూ భద్రత కరువైంది. పోలీసు శాఖ గాడి తప్పడానికి ప్రధాన కారణం పోస్టింగ్‌ల్లో పెద్ద ఎత్తున పైరవీలే అని సొంత శాఖలోనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బులు పెట్టి..పోస్టింగ్‌లు పొందిన కొందరు అధికారులు విధి నిర్వహణపై దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



### నిర్లక్ష్యం....ఏకపక్షం

ట్రై కమిషనరేట్ల పరిధిలో ఈ మధ్య జరుగుతున్న హత్యలు, ప్రతీకార దాడులకు కొందరు పోలీసు అధికారుల నిర్లక్ష్యం, ఏకపక్ష నిర్ణయాలే ప్రధాన కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై సంబంధిత ఠాణా అధికారులు స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం లేదా ప్రత్యర్థి వర్గానికి కొమ్ముకాసి బాధితులకు అన్యాయం చేయడంతో చిన్నపాటి గొడవలు సైతం ప్రతీకార దాడులు, హత్యలకు దారి తీస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

### గస్తీకి సుస్తీ..

గతంలో రోడ్లపై విజిబుల్ పోలీసింగ్ కనిపించేది. తరచూ పోలీసు గస్తీ తిరిగేది. ప్రస్తుతం గస్తీకి సుస్తీ పట్టింది. ఒకప్పుడు సీసీ కెమెరాలు లేని సమయంలో పోలీసు గస్తీ ముమ్మరంగా ఉండి నేరాల నియంత్రణ, శాంతిభద్రతల నిర్వహణ సుస్థిరంగా ఉండేది. ఇప్పుడు అడుగడుగునా సీసీ కెమెరాలున్నా.. దారుణాలు జరుగుతున్నాయి. బస్తీలు, కాలనీలు, ప్రధాన రహదారులపై గస్తీ లేకపోవడంతో రోడ్లపై దుండగులు కత్తులతో స్వైరవిహారం చేస్తున్నారు. దారిదోపిడీలూ పెరిగిపోతున్నాయి.

### డయల్ 100కు ఫోన్ చేసినా..

ట్రై కమిషనరేట్ పరిధిలో డయల్ 100 ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదైనా ఘటన జరిగినప్పుడు బాధితులు ఫోన్ చేసిన అరగంట తరువాత పోలీసులు ఘటనా స్థలికి చేరుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### తరచూ బదిలీలతో..

ఈ మధ్య కాలంలో తరచూ జరుగుతున్న బదిలీలు కూడా శాంతి భద్రతలు విఫలమయ్యేందుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఎందుకంటే ఒక అధికారి తాను పనిచేస్తున్న ఏరియాపై పట్టు సాధించాలంటే కనీసం సంవత్సరకాలమైనా పనిచేయాలి. కానీ గడిచిన ఆరునెలల కాలంలో ఏ అధికారి ఎప్పుడు బదిలీ అవుతాడో తెలియక అయోమయ పరిస్థితి నెలకొన్నది. చాలా మంది అధికారులు పోస్టింగ్ తీసుకున్న నెల, రెండు నెలల్లోనే మరోచోటకు బదిలీ అయిన సందర్భాలు చాలా ఉన్నాయి.

# మంత్రి చెబితేనే చేశా..

జగన్ ఇంటి వద్ద కూల్చివేతలపై జోనల్ కమిషనర్ వివరణ

బల్దియా కమిషనర్ ఆగ్రహం..

జీఏడీకి రిపోర్టు చేయాలంటూ ఉత్తర్వులు

సిటీబ్యూరో: ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నివాసం వద్ద కూల్చివేత ఘటనలో కీలక పరిణామం చోటు చేసుకున్నది. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు ఏసీపీ సంపత్ ఆధ్వర్యంలో శనివారం జగన్ నివాసం బయట ఫుట్‌పాత్‌పై నిర్మించిన సెక్యూరిటీ గదులను కూల్చివేసిన సంగతి తెలిసిందే. ఇటీవల ఎన్నికల్లో జగన్ ఓటమిపాలవ్వడంతో భద్రతను తొలగించడం, గురు దక్షిణగా ఇక్కడి సీఎం రేవంత్‌రెడ్డి జగన్ ఇంటి వద్ద కూల్చివేతలు జరిపించారని సోషల్ మీడియా వేదికగా చర్చ జరుగుతున్నది. ఈ నేపథ్యంలోనే ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా కూల్చివేతలు జరిపిన ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ఐఏఎస్ అధికారి హేమంత్ బోర్కడేపై జీహెచ్ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి సీరియస్ అయ్యారు. ఉన్నతాధికారులకు సమాచారం లేకుండా కూల్చివేతలు చేపట్టడంపై ఆయనపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ మంత్రి ఆదేశాలతోనే కూల్చివేతలు జరిపానని సదరు జోనల్ కమిషనర్ వివరణ ఇచ్చారు. అయినా కమిషనర్ ఆమ్రపాలి జోనల్ కమిషనర్ హేమంత్‌ను బాధ్యతల నుంచి తొలగించి.. జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

# కిడ్నాప్ చేయించింది..బావమరిదే

బావతో 'ఆర్థిక' గొడవలే కారణం

ఇద్దరు నిందితులు అరెస్టు...


పరారీలో 10 మంది

శేరిలింగంపల్లి: ఆర్థిక లావాదేవీల్లో తేడాలు రావడంతో వరుసకు బావను కిరాయి ముఠాతో కలిసి కిడ్నాప్ చేయించాడు బావమరిది. ఈ కేసు ఛేదించిన గచ్చిబౌలి పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కేపీహెచ్‌బీ కాలనీలో నివసించే సత్తనపల్లికి చెందిన చదలవాడ సాయిగుప్తా (35), నిజాంపేటకు చెందిన కర్రె సతీశ్‌రెడ్డి(38)లు వ్యాపార భాగస్వాములు. చదలవాడ సాయిగుప్తాకు బావమరిది వరుసైన సత్తెనపల్లికి చెందిన భవిశెట్టి గౌతమ్(35) అధిక వడ్డీకి అప్పు ఇచ్చాడు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య లావాదేవీల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఇచ్చిన అప్పుకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కిడ్నాప్ చేసి డాక్యుమెంట్లు రాయించుకోవాలని గౌతమ్ భావించాడు. ఆల్విన్‌కాలనీలో నివాసముండే అశోక్‌రెడ్డిని కలిశాడు. ఇద్దరు కలిసి జగద్గిరిగుట్టకు చెందిన కిరాయి ముఠాతో కిడ్నాప్‌నకు పథకం రచించారు. ఈనెల 14న రాత్రి గచ్చిబౌలిలోని పీఎస్ఆర్ ప్రైమ్ టవర్స్ నుంచి సాయిగుప్తా, సతీశ్‌రెడ్డి కారులో ఇంటికి బయలుదేరారు. మరో కారులో గౌతమ్‌తో పాటు మరో 10 మంది వెంబడించారు. హఫీజ్‌పేట వరకు చేరుకున్న సాయిగుప్తా, సతీశ్‌రెడ్డి ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టారు. సాయిగుప్తా, సతీశ్‌రెడ్డిలను జగద్గిరిగుట్ట ప్రాంతంలోని నిర్మానుష ప్రాంతానికి తరలించారు. అప్పు తీసుకున్నట్లు డాక్యుమెంట్లపై సంతకం చేయాలని ఇద్దరిని చితకబాదారు. అక్కడి నుంచి వారిద్దరిని వికారాబాద్ జిల్లాలోని ఓ వ్యవసాయక్షేత్రంలోకి తీసుకెళ్లి తీవ్రంగా హింసించారు. సాయిగుప్తా భార్యకు ఫోన్‌చేసి డబ్బులు డిమాండ్ చేశారు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితులు వికారాబాద్‌లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.. అక్కడికి వెళ్లారు. గమనించిన దుండగులు సాయిగుప్తా, సతీశ్‌రెడ్డిలను వదిలి పరారయ్యారు. గౌతమ్, అశోక్‌రెడ్డిలను పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. మరో 10 మంది దుండగులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

# సీసీఎస్‌లో అవినీతి కంపు..!

ప్రక్షాళన మొదలుపెట్టిన నగర కమిషనర్

మల్టీజోన్ -2 కు 12 మంది సీఐల సరెండర్



సిటీబ్యూరో: ఆర్థిక నేరాలు జరిగితే హైదరాబాద్ సీసీఎస్‌కు వెళ్తే తమకు పక్కాగా న్యాయం జరుగుతుందనే భావన గతంలో ప్రజల్లో ఉండేది. నేడు అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. అవినీతి, అక్రమాలు సీసీఎస్‌లో రాజ్యమేలుతున్నాయి. ఫిర్యాదుదారులు, నిందితులు ఎవరైనా సరే.. అక్కడ లంచం ఇచ్చుకోవాల్సిందేనన్న ఆరోపణలు ఇప్పుడు బలంగా వినిస్తున్నాయి. సెంట్రల్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌పై ఏసీబీ దాడులు వరుసగా జరగడంతో నగర పోలీస్ ఉన్నతాధికారులు కూడా అప్రమత్తమయ్యారు. సీసీఎస్ ప్రక్షాళన మొదలు పెట్టారు. ఇందులో భాగంగానే నగర పోలీస్ కమిషనర్ 12 మంది సీఐలను మల్టీ జోన్-2కు సరెండర్ చేశారు. అలాగే నలుగురు ఎస్ఐలను కూడా సరెండర్ చేసినట్లు సమాచారం. అంతేకాకుడా ఛత్రినాక, మంగళ్‌హాట్, షాహినాయత్‌గంజ్ తదితర పోలీస్‌స్టేషన్లపై నిఘా పెట్టినట్లు తెలిసింది. ఇదిలాఉంటే ఇటీవల టీమ్-7 ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ఓ కేసును క్లోజ్ చేసేందుకు రూ. 15 లక్షలు లంచంగా బాధితుల వద్ద డిమాండ్ చేశాడు. అడ్వాన్స్‌గా రూ. 5 లక్షలు తీసుకొని, మిగతా డబ్బుల కోసం బాధితుడిపై ఒత్తిడి తెచ్చాడు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో రూ. 3 లక్షల లంచం డబ్బులు తీసుకుంటూ..ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. ఇలా సీసీఎస్ అంతా అవినీతి కంపు కొడుతున్నది. ప్రక్షాళన చేసేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. కాగా, సీసీఎస్‌లో నమోదయ్యే చాలా కేసుల్లో 41 సీఆర్‌పీసీ నోటీసులు నిందితులకు ఇస్తుంటారు. నోటీసులు ఇచ్చేందుకు కొందరు పోలీసు అధికారులు లక్ష రూపాయల నుంచి రూ. 5 లక్షలకుపైగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.